రేపు జిల్లా కబడ్డీ సీనియర్ పురుషుల జట్ల ఎంపికలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 21: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న జిల్లా కేంద్రంలోని లయెలా పాఠశాలలో సీనియర్స్ పురుషుల కబడ్డీ క్రీడా ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగా వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మార్చి 2 నుంచి 4 వరకు నాగార్జున సాగర్‌లోని పైలాన్ కాలనీలో జరగబోయే 70వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్ షిప్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు జిల్లా సెక్రెటరీ బాణాల భాస్కర్‌రెడ్డికి రిపోర్టు చేయాలని తెలిపారు.



ఉపాధి హామీ యాక్షన్ ప్లాన్

సిద్ధం



- 2024-25కు లేబర్ బడ్జెట్‌లో 75లక్షల పని దినాల లక్ష్యం
- 100 రోజులు ఉపాధి పొందిన కుటుంబాలు 894
- జిల్లాలో సరాసరి కూలి రూ.198
- పనుల గుర్తింపునకు గ్రామసభలు పూర్తి
- జిల్లాలో 2లక్షల మందికి పైగా ఉపాధి కూలీలు

కామారెడ్డి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసల నివారణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ పథకం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. గ్రామాల్లోని కూలీలు వలసలు వెళ్లకుండా నియంత్రిస్తూ వారికి ఉన్న గ్రామాల్లోనే ఉపాధి కల్పించడానికి పనులు చేపడుతున్నారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి కూలీల బడ్జెట్ రూపకల్పనలో 526 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించి పనులను గుర్తించారు. గతంలో ఉపాధి పనులు ఇష్టానుసారంగా జరిగిన క్రమంలో కేంద్ర ప్రభుత్వం పాత విధానానికి స్వస్తిపలికి కొత్త విధానాన్ని ముందుకు తీసుకువచ్చింది. ఉపాధి పనులపై సామాజిక తనిఖీలతో కేంద్రం పూర్తిగా నిఘాను పెంచింది. ఇప్పటికే నేషనల్ ఇన్‌ఫార్మెటిక్ సెంటర్(ఎన్ఐసీ) సర్వర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధి హామీ కూలీలకు వారి ఖాతాలోనే నేరుగా కూలీ డబ్బులను జమ చేస్తోంది. గత ప్రణాళికలో ఏక కాలంలో అనేక పనులు తీసుకున్న ఆయా గ్రామాల్లో 20 పనులు మాత్రమే ప్రారంభించి పూర్తిచేసి వెసులుబాటు కల్పించారు. ఒక పనిపూర్తయిన తర్వాతే మరో పని చేపట్టే విధంగా ఆదేశాలు ఉన్నాయి.

జిల్లాలో 2లక్షల మందికిపైగా ఉపాధి కూలీలు

జిల్లాలోని 526 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 2 లక్షలకు పైగా ఉపాధిహామీ కూలీలు ఉన్నారు. మొత్తం జాబ్‌కార్డులు 2,50,210 ఉండగా ఇందులో 2లక్షల మంది కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. గత ఏడాది 89వేల కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించారు. ఒక్కో కుటుంబానికి 29 రోజులు ఉపాధి చూపించారు. ఇందులో 894 కుటుంబాలు 100 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్నాయి. అయితే గత రెండేళ్ల కిందట ఉపాధి హామీ పనుల్లో జిల్లా మొదటిస్థానంలో ఉండేది. ప్రస్తుతం వెనుకబడింది. అధికారులు ఉపాధి హామీ పనులకు ప్రోత్సహిస్తున్నప్పటికీ కూలీలు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీనికి కారణం ఇతర పనులకు వెళితే డబ్బులు ఎక్కువగా రావడమేనని కూలీలు చెబుతున్నారు. ఉపాధి పనుల్లో గరిష్ఠం రూ.272 ఇస్తున్నారు. సాధారణంగా పనిచేసే వారికి రూ.150 నుంచి 220 వరకు మాత్రమే వస్తోంది. ఇతర పనులకు వెళితే గరిష్ఠంగా రూ.400ల నుంచి రూ.600ల వరకు రావడంతో కూలీలు అటువైపు ఆసక్తి చూపుతున్నారు.

ఉపాధి పని దినాల లక్ష్యం

జాతీయ ఉపాధిహామీ పథకానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 75లక్షల పని దినాలకు అధికారులు గ్రామసభలు పెట్టి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులోంచి ఎన్ని పని దినాలకు కేంద్రం అనుమతిస్తుందో వేచి చూడాలి. గత ఏడాది 83.72 లక్షల పని దినాలకు ప్రతిపాదనలు పంపించగా కేవలం 27లక్షల పని దినాలకు అనుమతులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 2.76లక్షల జాబ్‌కార్డులు ఉండగా 526 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు ఇటీవలే పూర్తి చేశారు. కూలీల నుంచి వచ్చే డిమాండ్ ఆధారంగా పనుల గుర్తింపు ప్రక్రియ కొనసాగింది. వ్యవసాయ అనుబంధ పనులు చేయడానికే అనేక పంచాయతీలు మొగ్గు చూపాయి.

ఉపాధి పనుల తీర్మానాలు ఇవే..

త్వరలోనే ఉపాధి హామీ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. కొత్త ఆర్థిక సంవత్సరం లక్ష్యం కోసం అధికారులు గ్రామసభలు నిర్వహించి పనుల కోసం పలు తీర్మానాలు చేశారు. స్టోరేజీ ట్యాంక్‌లు, కల్లాలు, పాంపాండ్స్, నాడెం కంపోస్ట్ షెడ్స్, పెద్ద, చిన్న నీటి కుంటలు, భూమి అభివృద్ధి పనులు పంట పొలాలకు అనుసంధాన రోడ్ల పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఇవేకాకుండా మౌలిక సదుపాయాల కోసం అవసరమైన వారికి వ్యక్తిగతంగా ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, వినియోగంలో లేని రోడ్లను బాగు చేయడం, పాడుబడిన బావులను పూడ్చడం, హరితహారం పథకంలో భాగంగా మొక్కలు నాటడం, గుంతలు తీయడం, కంచెల నిర్మాణాలు, మొక్కలకు నీరు పోసే పనులు నిరంతరం కొనసాగించాలని గ్రామసభల్లో అత్యధికులు తీర్మానించారు.

వ్యవసాయ అనుబంధ పనులకే మొగ్గు

ఉపాధి హామీ పనుల ప్రారంభం నుంచి మట్టి పనులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టినప్పటికీ ఆస్తుల సృష్టి జరగలేదు. అధికంగా చెరువుల్లో పూడిక మట్టి తొలగించడానికి ఉద్దేశించిన పనులతో ప్రయోజనం లేకపోయింది. చాలా చోట్ల ఈ పథకంపై పర్యవేక్షణ లేక గాడి తప్పింది. అవినీతి చోటు చేసుకున్నట్లు పలు సామాజిక తనిఖీల ద్వారా తేలింది. దీంతో అధికారులు ఈ ఏడాది వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత ఇస్తూనే ఆస్తులను సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం ద్వారా మెటీరియల్ కంపోనెంట్ ద్వారా చేపట్టే పనులు మాత్రమే శాశ్వత ప్రయోజనం చేకూరే విధంగా ఉంటున్నాయని దాని స్థానంలో కూలీలు చేసే పనులు కూడా ఉపాధి పనులు సత్ఫలితాలు ఇచ్చే విధంగా ఉండాలని అధికారులు భావిస్తున్నారు.





బాన్సువాడలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

పీఎం విశ్వకర్మ దరఖాస్తులను పరిశీలించాలి

కలెక్టర్ జితేష్ వి. పాటిల్

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 21: పీఎం విశ్వకర్మ పథకం దరఖాస్తులను పరిశీలించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన బాన్సువాడ పట్టణంలో అధికారులతో సమావేశమయ్యారు. పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన వారిని ఎంపిక చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అలీం, చైర్మెన్ జంగం గంగాధర్, తుల శ్రీనివాస్ తదితరులున్నారు.

అర్హులను ఓటరుగా నమోదు చేయాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలో అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ డూప్లికేట్ కార్డులు, ఫొటో సిమిలర్ ఎంట్రీ, మరణించిన ఓటర్ల పేర్లను తొలగించి తుది ఓటరు జాబితాను ఈనెల 8న విడుదల చేశామని తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ చివరి రోజు వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించుకుని అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. బూత్‌స్థాయిలో తుది ఓటరు జాబితాను పరిశీలించి ప్రముఖుల పేర్లు తొలగిపోకుండా చూడాలని, మార్పులు, చేర్పులు, బోగస్ ఓటర్లున్నట్లయితే తెలపాలని తొలగింపునకు ఫారం-7 ద్వారా దరఖాస్తు చేయాలని తెలిపారు. కళాశాల స్థాయిలో స్వీప్ కార్యకలాపాలు చేపట్టి ఓటరు నమోదుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించాలని, కుల, మతాలను రెచ్చగొట్టే ప్రసంగాలు ఉండరాదని, ఓటర్లను డబ్బు, మద్యం, కానుకలతో ప్రలోభాలకు గురి చేయరాదని తెలిపారు. జిల్లాలో 791 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌ల ప్రథమస్థాయి పరిశీలన జరిపామని తెలిపారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కాసింఅలీ, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రవాణా శాఖ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి

- నియమిత సమయంలో ట్యాక్స్‌లు కడితే ఎటువంటి జరిమానాలు ఉండవు
- సమయం దాటితే 50 శాతం ఫైన్
- తాము తనిఖీలు చేపట్టినప్పుడు పట్టుపడితే 200 శాతం జరిమానా విధిస్తాం
- జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 21: రవాణాశాఖ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్ట ప్రకారం వాహనాల ట్యాక్స్‌లు నియమిత సమయంలో కడితే ఎలాంటి జరిమానాలు ఉండవని సమయం దాటిగడితే 50 శాతం జరిమానాలను, ఒకవేళ తాము తనిఖీలు చేపట్టినప్పుడు పట్టుబడితే 200 శాతం జరిమానాలను విధిస్తామని తెలిపారు. ఏ వాహనానికైనా నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు ఇన్సూరెన్స్, ఆర్‌సీతో పాటు వాహనదారుడికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని ట్రాన్స్‌పోర్ట్ వాహనాలలో చిన్నవాహనాలకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ ఉండాలని తెలిపారు. భారీ వాహనాలకు పర్మిట్‌తో పాటు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ ఉండాలని తెలిపారు. నూతన చట్టం ప్రకారం ప్రతి ఒక్కరూ వాహనానికి ఇన్సూరెన్స్ చేయించాలని ఒకవేళ ప్రమాదవశాత్తు ఎవరినైన వాహనం ఢీకొని మృతి చెందితే ఆ కుటుంబానికి ఇన్సూరెన్స్ ద్వారా 3 నెలల్లో డబ్బులు అందుతాయని తెలిపారు. ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే వారి ఆస్తులను జప్తు చేసి మరి ఇచ్చేలా నిబంధనలు సడలింపు చేశారని తెలిపారు. ఇక ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. ఈ మధ్య కాలంలో హెల్మెట్ లేకపోవడంతో మరణాలు సంభవిస్తున్నాయని హెల్మెట్ ఉంటే 99 శాతం మరణాలకు ఆస్కారం ఉండదని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ఏ వ్యక్తి అయిన డ్రైవింగ్ లైసెన్స్‌కు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా ప్రజలు ఏదైన సమస్య తలెత్తినప్పుడు సిబ్బంది చెప్పిన విషయాల్లో అసంతృప్తి ఉంటే తనను నేరుగా కలువవచ్చన్నారు. అప్పటికప్పుడు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



కామారెడ్డిలో జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

కామారెడ్డి నుంచి అయోధ్యకు బయలుదేరిన రైలు

కామారెడ్డి టౌన్/బీర్కూర్, ఫిబ్రవరి 21: కామారెడ్డి నుంచి అయోధ్యకు రైలు బయలుదేరి వెళ్లింది. ఈ రైలును బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోధ్య రామమందిర నిర్మాణం పూర్తయి దర్శనాలు ప్రారంభం అయిన తర్వాత రామజన్మభూమి తీర్థక్షేత్రట్రస్ట్ ఆధ్వర్యంలో రోజు ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన రామ భక్తుల కోసం రైలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కామారెడ్డి రైల్వేస్టేషన్ నుంచి 1345 మంది రామభక్తులు వెళ్లారని తెలిపారు. భక్తుల కోసం రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్, అభియాన్ రాష్ట్ర కన్వీనర్ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్ని రకాల సౌకర్యాలను కల్పించారని తెలిపారు. ఈనెల 26న దర్శనం పూర్తయిన తర్వాత తిరిగి కామారెడ్డికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలే భాస్కర్‌రెడ్డి, పైడి ఎల్లారెడ్డి, జైపాల్‌రెడ్డి, రంజిత్ మోహన్, మర్రి రాంరెడ్డి, తేలు శ్రీనివాస్, బాపురెడ్డి, రాము, భరత్, సురేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా బీర్కూర్ మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి అయోధ్యలోని బాల రామున్ని దర్శించుకునేందుకు 20 మంది భక్తులు తరలివెళ్లారు.

ఓటు నమోదుకు

మరో అవకాశం



- ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- పోలింగ్ శాతం పెంచేందుకు అధికారుల కసరత్తు
- కళాశాలల్లో యువతకు అవగాహన కార్యక్రమాలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 21: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అర్హులైన వారందరిని ఓటరు జాబితాలో చేర్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు యువతకు మరోసారి ఓటు హక్కు నమోదుకు అవకాశం కల్పించారు. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు అర్హులైన యువతి, యువకుల పేర్లు నమోదు చేయడంతో పాటు మార్పులు, చేర్పులు, పేర్ల తొలగింపునకు అవకాశం కల్పించారు. ఆన్‌లైన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో సంబంధిత దరఖాస్తు ఫారాలు పూర్తి చేసి ఇవ్వాల్సి ఉంటుంది.

అవగాహన కార్యక్రమాలు ఇలా..

ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు ఆదేశించారు. నూతన ఓటర్ల నమోదుతో పాటు ఓటింగ్ శాతం పెరిగే విధంగా ఓటర్ హెల్ప్‌లైన్‌తో పాటు ఓటర్ సర్వీస్ పోర్టల్ లేదా ఆఫ్‌లైన్‌లో ఓటరు నమోదుకు క్యాంపస్ అంబాసిడర్ల ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. మార్చి 1న అన్ని పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకుల పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలో మాక్ పోలింగ్ నిర్వహణ, 7న రంగోలి, మెహెంది కార్యక్రమాల ద్వారా స్వయం సహాయక సంఘాలు, జిల్లా, మండల సమాఖ్య సంఘాలకు తక్కువ ఓటింగ్ నమోదవుతున్న పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ శాతం పెంపుదలపై అవగాహన, మార్చి 15న గ్రామ, మున్సిపల్ స్థాయిలో పాఠశాల, కళాశాల విద్యార్థులతో మానవహారం, మార్చి 22న బూత్‌స్థాయిలో ఓటింగ్ శాతం పెంపుదలపై సమావేశాలు, 23న ప్రతీ నియోజకవర్గంలో 5కే రన్, 28న నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన గోడలపై వాల్‌గ్రాఫిటి ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

యువత ముందుకొస్తే మేలు

ఇటీవల రెండు సార్లు ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. ఈ నెల 8న తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. మరోసారి ఓటరు నమోదుకు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో ఓటరు నమోదుకు యువత స్పందించి తమపేరు నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 18 ఏళ్లు నిండితే కళాశాలలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల్లో అక్కడిక్కక్కడే నమోదు చేయనున్నారు.

వేములవాడ రాజన్న సేవలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

వేములవాడ ఫిబ్రవరి 21: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కోడె మొక్కు చెల్లించుకొని స్వామివారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ అల్లి శంకర్ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు ఉన్నారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు కార్పొరేటర్లు

నిజామాబాద్అర్బన్, ఫిబ్రవరి 21: నగరానికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ కార్పోరేటర్లు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్అలీ, ఎమ్మెల్సీటీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌ల సమక్షంలో అబ్దుల్ ఖుద్దూస్, శివచరణ్‌లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తాహెర్‌బిన్‌హందాన్, గడుగు గంగాధర్, నగర అధ్యక్షుడు కేశవేణు, రత్నాకర్, ఫయాజ్, దయాకర్ గౌడ్, నజీబ్అలీ, పప్పాఖాన్,రాజేశ్, మిస్బా తదితరులు ఉన్నారు.

వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిరంతరం చేయాలి

కోటగిరి, ఫిబ్రవరి 21: గ్రామాల్లో అసక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిరంతరం చేయాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. గర్భిణీలు, చిన్న పిల్లలకు ఇచ్చే టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లలు, గర్భిణీల వివరాలు కలిగిన జాబితా తప్పఉండా అందుబాటులో ఉండాలని సూచించారు. టీకాల వివరాలను యూవీన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి గురువారం రక్తపోటు, మధుమేహంతో ఉన్న వారికి వయోవృద్ధులకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సరోజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ క్రీడాకారులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 21: ఈనెల 21నుంచి 25వరకు పాట్నాలో జరుగుతున్న జూనియర్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో కళ్యాణ్‌రాజ్, అర్వింద్, మహేష్, బాలికల విభాగంలో ఇందూ, శ్రావిక, సాత్విక, సోనీలు పాల్గొననున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి తెలిపారు. అలాగే ఈనెల 21నుంచి 26వరకు న్యూఢిల్లీలో ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న 43వ సీనియర్, 30వ జూనియర్ ఆసియాట్రాక్, 12వ పారాసైక్లింగ్ చాంపియన్ పోటీలకు జిల్లాకు చెందిన రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి, జిల్లా కార్యదర్శి విజయ్‌కాంత్‌రావ్ అఫిషియల్‌గా ఎంపికయ్యారు. ఆసియా ఖండం నుంచి 18దేశాల సైక్లిస్ట్ పాల్గొంటున్నా ఈ పోటీలకు అఫిషియల్‌గా విజయ్‌కాంత్ రావ్ ఎంపిక కావడం పట్ల రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, సూర్య ప్రకాష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

- హాజరుకానున్న ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా
- ఈ పాలకవర్గానికి ఇదే చివరి బడ్జెట్
- బడ్జెట్‌పై చర్చ సాగేనా ?

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 21 : నగర మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం గురువారం జరగనుంది.నగరమేయర్ దండు నీతి కిరణ్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. నగరంలోని నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవన సమావేశ మందిరంలో బడ్జెట్ ప్రవేశపెట్టన్నారు. ఈ పాలకవర్గానికి ఇదే చివరి బడ్జెట్ సమావేశం కానుంది. మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ పార్టీల కార్పొరేటర్లు ఇతర పార్టీలలోకి వెళ్లడంతో బడ్జెట్ సమావేశం ఆసక్తికరంగా మారనుంది. ఇన్ని రోజులుగా పెద్ద ప్రతిపక్షం లేకుండా సాగిన సమావేశాలకు ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీల్లో కార్పొరేటర్లు ఎక్కువగా చేరడంతో బడ్జెట్‌పై సమావేశం ఆసక్తికరంగా నెలకొంది.


మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

● 2024 -25కు 274 కోట్లు 89 టార్గెట్

2024-25 సంవత్సరానికి గాను మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ సంవత్సరానికి గాను 274 కోట్లు 89 లక్షల టార్గెట్ విధించుకుంది. రూ.90 కోట్ల 10 లక్షలు మున్సిపల్ ఆదాయం ద్వారా రాగ డిపాజిట్‌ల ద్వారా ఏడు కోట్ల 20 లక్షల బడ్జెట్‌లో ప్రవేశ పెట్టనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాండ్ ధర రూ.17 కోట్ల 60 లక్షలు మొత్తంగా రూ.274 కోట్ల 89 లక్షలుగా ఉంది. సంవత్సరం రూ.272 కోట్లు 72 లక్షలుగా ఉండగా ప్రస్తుతం రెండు కోట్లపైగా బడ్జెట్ పెరిగింది.

● హాజరుకానున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

నిజామాబాద్ నగర చివరి మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేష్‌కుమార్‌గౌడ్ హాజరుకానున్నారు. అంతే కాకుండా ఎమ్మెల్యేగా ఎన్నికైన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త బడ్జెట్ సమావేశంలో పాల్గొనున్నారు.

ఘనంగా ఎదురుగొండ వెంకన్న రథోత్సవం


ఎదురుగొండలో స్వామి రథాన్ని లాగుతున్నభక్తులు

సిరికొండ ఫిబ్రవరి 21 : మూడు జిల్లాల సరిహద్దులో ఎదురుగొండపై వెలిసిన శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి రథోత్సవం బుధవారం భక్తుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. సిరికొండ మండలం తూంపల్లి శివారులో ఎదురుగొండపై కొలువు దీరిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్లా జిల్లాల సరిహద్దులో అడవీలో మూడురోజులుగా జాతర సాగుతోంది. బుధవారం ఉదయం స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా, భక్తుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. ఈ జాతరకు కామారెడ్డి, సిరిసిల్లానిజామాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు హాజరై శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు ముట్టజెప్పుకున్నారు. జాతరకు హాజరైన భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సత్రం ఏర్పాటు చేశారు.

'పార్లమెంటు ఎన్నికల్లో లక్ష ఓట్లు టార్గెట్'


బీజేపీలో చేరుతున్న వివిధ పార్టీల నేతలు

పెద్దబజార్, ఫిబ్రవరి 21:గత పదేళ్ల నుంచి నరేంద్రమోదీ అవినీతి లేని పాలనను అందించారని, మేధావులు, విద్యావంతులు అందరు అన్ని పార్టీ నాయకులు పార్టీలకు అతీతంగా కేంద్రంలో బీజేపీ రావాలని ఔర్‌ఏక్ బార్ మోదీ సర్కార్‌ను కోరుకుంటున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణలు అన్నారు. నగరంలోని ఆరో డివిజన్‌లో 50మంది వివిధ పా ర్టీల నేతలు బుధవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధి దేశ రక్షణ కేవలం బీజేపీతోనే సాధ్యమని నమ్మి చిట్టచివరి పేదోనికి ప్రభుత్వ ఫలాలు అందాలంటే సబ్‌కాసాథ్ సబ్‌కా వికాస్ కేవలం బీజేపీతోనే సాధ్యమవుతోందన్నారు. పార్టీలో చేరిన వారందరికి పార్టీ కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు భైకాన్‌మధు, మల్లేష్‌యాదవ్, సుధీర్, ఆకుల శ్రీనివాస్, నారాయణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పని చేయడం నా జీవిత ఆశయం

● ఎమ్మెల్యే పోచారం

వర్ని,ఫిబ్రవరి21: ప్రజల కోసం నిరంతరం పని చేయడమే తన జీవిత ఆశయమని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం వర్ని మండల కేంద్రంలో ఉమ్మడి వర్ని మండలంలోని 160మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. తాను చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తిరిగి తనను ఎన్నుకున్నారని అందుకు వారికి రుణపడి ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ మోతిసింగ్, నియోజకవర్గ బాధ్యులు సురేందర్ రెడ్డి, సింగంపల్లి గంగారాం, గిరి, జడ్పీటీసీ హరిదాస్, వైస్ ఎంపీపీ బాలరాజు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం కామారెడ్డి పట్టణానికి చెందిన శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో సుమారు లక్ష రూపాయల వ్యయంతో విద్యార్థినులకు దుస్తులను, స్కూల్ బ్యాగ్‌లను, వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 235మంది విద్యార్థినులకు సివిల్ డ్రెస్సులు, వాటర్ బా టిళ్లను పంపిణీ చేయగా, ఇదే పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థినులకు సివిల్ డ్రెస్సులు, వాటర్ బాటిళ్లతో పాటు స్కూల్ బ్యాగులను సైతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వీణ, శ్రీరామ సేవా సమితి సభ్యులు గందె నర్సింలు, ఉప్పల గిరిధర్, బుచ్చయ్య, సునీల్, వెంకటేశం, గంగాధర్, పాఠశాల ఉపాధ్యాయినులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో శ్రీగిరి గుట్టపై మహాయజ్ఞం

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 21: మండల కేంద్రం శివారులోని శ్రీగిరి గుట్టపై సతీ సమేతంగా కొలువుదీరిన కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి జాతరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహాయజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామాభివృద్ధి, ఆలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో శనివారం జరుగనున్న జాతరా ఉత్సవాలు నిర్వహణ నిమిత్తం ఆలయ అర్చకులు నూనె అనిల్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, మహాయజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంగిరేకుల మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు గండికోట సాయిరాం, కార్యదర్శి అంకిత్ కోశాధికారి కుమ్మరి భూమేశ్వర్, పాలక వర్గసభ్యులు షైలారం మధుకర్, రాజేష్, శివ, నాగరాజు రాజు, కొత్తపల్లి చందు గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు. జాతరా సందర్భంగా ఆలయంవద్ద ప్రతి రోజు భజన కార్యక్రమాలు జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

మున్సిపల్ వాహనాల కొనుగోళ్లపై విచారణ జరపాలి

ఖిల్లా, ఫిబ్రవరి 21:మున్సిపల్ కార్పొరేషన్ వాహనాలు, పనిముట్ల కొనుగోళ్లపై విచారణ జరుపాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ శాఖలో రూ.5వేల కోట్ల అవినీతి జరిగినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. అందులో భాగంగానే నగరపాలక సంస్థలో 2017నుంచి కొనుగోలు చేసిన వాహనాలు, పనిముట్లపై వివిధ అభివృద్ధి పనులపేరుతో జరిగిన పనులపై విచారణ జరిపి సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సిబ్బందికి అందించే పనిముట్లు నాసిరకం ఉన్నాయని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బనిలత, జిల్లా కన్వీనర్ కే.మధు, నగర అధ్యక్షుడు ఎం.అజయ్, తిట్టేరాజు, గీతాంజలి, దండుజ్యోతి పాల్గొన్నారు.

పీజీ,ఇంటిగ్రేటెడ్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 21: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల పీజీ 1వ సెమిస్టర్ ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, 5ఏళ్ల ఇంటిగ్రెటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్ , ఐఎంబీఏ, 7వ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. వర్సిటీలోని సైన్స్ అండ్ ఆర్ట్స్ కళా శాల పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్‌యాదగిరి పరిశీలించారు.ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఉదయం జరిగిన పరీక్షలకు 1911మంది విద్యార్థులకు గాను 1820 మంది హాజరయ్యారని, 91మంది గైర్హాజరయ్యరని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు.

మద్యం పట్టివేత

రెంజల్,ఫిబ్రవరి21: మండలంలోని కందకుర్తి వద్ద మద్యం తరలిస్తున్న తాడ్‌బిలోలికి చెందిన గురడి మహిపాల్ రెడ్డి అనే వ్యక్తి వద్ద 8బాటిళ్ల(16లీటర్ల) మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని బోధన్‌కు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు

కోటగిరిలో ఘనంగా డీఐఈవోకు ఘన సన్మానం

కోటగిరి,ఫిబ్రవరి21: కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఇంటర్మీడియట్ జిల్లా అధికారి రఘురాజ్ పదవి విరమణను పురస్కరించుకుని బుధవారం కళాశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డీఐఈవోను లెక్చరర్లు ఘనంగా సన్మానించారు. కాలేజ్ డే వేడుకలను సైతం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన పలువురికి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డీఐఈవో రఘురాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, వర్ని ప్రిన్సిపాల్ రవికుమార్, చిరంజీవి, రజియొద్దీన్, దేవురాం, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల శిక్షణ పునాదిరాయి లాంటిది

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 21: పోలీస్ కానిస్టేబుల్ గా శిక్షణ పొందుతున్న వారందరు శిక్షణలో నేర్చే విషయాలు ఉద్యోగ రీత్యా ఎంతో పనిచేస్తాయని శిక్షణ పునాది రాయి లాంటిందని కామారెడ్డి జిల్లా ఎస్పీ సీహెచ్ సింధు శర్మ అన్నారు. బుధవారం ఎస్సీటీపీసీఎస్‌ఎఆర్ సైబరాబాద్ 2024 బ్యాచ్‌కు 9నెలల పాటు శిక్షణ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింధు శర్మ మాట్లాడుతూ.. శిక్షణ లో నేర్చే విషయాలు మెలుకవలు ఉద్యోగంలో ఎంతో తోడ్పాటు అందిస్తాయని పోలీస్ విధి బాధ్యతయుతమైనదని, ఈ వృత్తిని ఎంచుకున్న ప్రతి జవాను కు అభినందనలు తెలిపారు. పోలీసింగ్ వ్యవస్థలో దారి దోపిడిలను మొదలుకొని సైబర్‌క్రైం వరకు జరుగుతున్న మార్పులకు అనుగుణంగా పోలీస్ వ్యవస్థలో కూడా మార్పులు జరుగుతునయన్నారు. ప్రస్తుతం 7వ బెటాలియన్‌లో 13 వ బ్యాచ్ కు ట్రైనింగ్ సెంటర్ లలో 278మంది ఎస్‌సీటీపీఎస్‌లకు శిక్షణ అందిస్తున్నమని కమాండెంట్ రామ్ ప్రకాశ్ తెలిపారు. ఇందుకోసం అనుభవజులైన 36మంది శిక్షకులు వారికి ట్రైనింగ్ ఇస్తారని నిత్యం శిక్షణ ఇచ్చి రాబోవు కాలంలో ఏలాంటి పరిస్థితులు ఎదుర్కొనేల మంచి రక్షక భటు లుగా తయారు చే స్తామన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కమాం డెంట్ ఆంజ నేయ రెడ్డి, భాస్కరరావు, ఏవో హంస రాణి, యూ ఎంవోఅనుపవు, ఆర్ఐలు వెంక టేశ్వర్లు, నరేశ్, ఆర్ ఎస్సైలు, శిక్షణ కానిసే ్టబుల్స్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎస్పీ

సంక్షిప్త సమాచారం

నగరంలో అంతర్గత క్రీడలు ప్రారంభం


క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌అర్బన్ , ఫిబ్రవరి 21:జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో అంతర్గత క్రీడలను బుధవారం ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారయణ ప్రారంభించారు. విద్యార్థులు యోగా, కర్రసాము ప్రదర్శించగా ఆయన తిలకించారు. విద్యార్థులు విద్యతో పాటు శారీరక, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలని అన్నారు. ఆడపిల్లల ఆత్మరక్షణకు కర్రసాము లాంటివి నేర్చుకోవాలన్నారు. గిరిరాజ్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామ్మోహన్, పీఈటి బాలమణి, స్థానిక కార్పోరేటర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు శుభాకాంక్షలు


రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ కు శుభాకాంక్షలు తెలుపుతున్న తాహెర్‌బిన్‌హందాన్

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 21:రాష్ట్రవక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ని యమితులైన సయ్యద్ అస్మత్‌ఉల్లాఉసానీని బుధవారం హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ ఉపా ధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్ మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. నూతనంగా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఎన్నికైనందుకు అయనకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపా రు. ఆయన తో పాటు నాయకులు జావెద్‌అక్రం, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు రావుట్ల విద్యార్థి

సిరికొండ ఫిబ్రవరి 21: జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా సైన్స్ పోటీలో ప్రథమ బహుమతిని అందుకున్న రావుట్ల హైస్కూల్ విద్యార్థిని ఓరుగంటి రాజేశ్వరి రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన సైన్స్ పోటీలలో సిరికొండ మండలం రావుట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఓరుగంటి రాజేశ్వరి ప్రథమ బహుమతిని గెలుచుకుందని ప్రధానోపాధ్యాయడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా హాజరైన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ముకరంద విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవ వేడుకలు

బీర్కూర్, ఫిబ్రవరి 21: బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం శ్రీ కోదండ రామాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆలయ ప్రధాన పూజారి శేషు పంతులు, వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. స్వామి వారికి అభిషేకం చేసి పట్టు వస్త్రాలు, బంగారు నగలతో అందంగా అలంకరించారు. వేలాది మంది భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. బీర్కూర్ మండల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కృష్ణుడి గుడి నిర్మాణానికి భూమిపూజ

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 21: నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామంలో బుధవారం కృష్ణుడి గుడి నిర్మాణానికి పీఏసీఎస్ చైర్మన్ పెర్క శ్రీనివాస్ యాదవ్ కులస్తులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల కుల దైవం అయిన శ్రీ కృష్ణుడి గుడికి నిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరాం యాదవ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, బొట్టే రమేష్, మేకల రాములు, ధార లస్మయ్య, ఆనంద్, ధర్మయ్య, కుల స్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 21 :ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో బుధవారం పది లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్డు అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే రూ. 10 లక్షలు మంజూరు చేశారని హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్, గురు ప్రతాప్, అజార్ ఖాద్రి, మ హేష్, మల్లయ్య, అహ్మద్,తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవీపేట,ఫిబ్రవరి21: నవీపేట రైల్వే స్టేషన్, రైల్వే గేట్‌ల మధ్యన బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. మృతుడు 50-55సంవత్సరాల మధ్యన ఉంటాడని, పసుపు రంగు టీషర్టు, నలుపు డబ్బాల ప్యాంటు ధరించి ఉన్నాడని అయన పేర్కొన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య

బోధన్ రూరల్, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది హేయమైన చర్య అని బోధన్ తెలుగు యువత ఇంచార్జి ఎత్తొండ రాజేందర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మం గళవారం కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈనాడు కార్యాలయంపై దాడులకు పాల్పడుతూవిలేకరులను భయభ్రాం తులకు గురి చేయడం సరికాదన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో వాస్తవాలు రాసే పత్రి కలపై వైసీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని అభి వర్ణించారు. ప్రజాస్వామ్యంలో పత్రిక లకు స్వేచ్ఛ ఉందని, వీటిపై దౌర్జన్యాలకు పాల్పడటం సరికాదన్నారు. అంధ్ర ప్రదేశ్ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చిన నాటి నుంచి ఆంధ్రజ్యోతి, ఈనాడు రిపోర్టర్లను టార్గెట్ చేయడం, భౌతిక దాడు లకు పాల్ప డటం సరికాద న్నారు. తెలుగుదేశం పార్టీ దీనిని తీవ్రంగా ఖండిస్తుందన్నారు.


కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య


భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం


జంపన్నవాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొరలు

జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు



ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం.. జన సంద్రం..


సమ్మక్క గద్దె

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటు చూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనమైంది.



వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.


జంపన్నవాగు నుంచి గద్దెల వద్దకు వచ్చే దారిపై భక్తజనం రద్దీ



బీర్కూర్‌లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

బీర్కూర్, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. భారతమాత చిత్ర పటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సంతోష్ మాట్లాడుతూ మనిషి జీవితంలో మొట్ట మొదటగా నేర్చుకునే భాష మాతృభాష, అమ్మమాట అన్నారు. అందుకే ప్రతీ బిడ్డ అమ్మను కాపాడుకున్నట్లే మాతృభాషను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ రామాలయ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 21: నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని రామాలయ నూతన కమిటీ సభ్యుల ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అరిగే నారాయణ, ఉపాధ్యక్షుడిగా అనుసూరి శ్రీనివాస్, కార్యదర్శిగా గుత్తుల శ్రీనివాస్, క్యాషియర్‌గా గుడిసెల యాదగిరిగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి

దోమకొండ, ఫిబ్రవరి 21: మండలంలోని అన్ని గ్రామాల్లో జీపీల వారికి డెవలప్‌మెంట్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఎంపీడీవో తిరుపతి రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వంద శాతం ఇంటిపన్నులు వసూలు చేయాలన్నారు. పీఎం విశ్వకర్మ నర్సరీలు 100శాతం జరమినేషన్ చేయాలని పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రజని, టీఏలు రాజేశ్వర్, లింగం, కార్యదర్శులు సౌజన్య, రమేష్, అంజయ్య, భానుశ్రీ, అరుణ, రాహుల్‌గౌడ్, రాజశేఖర్, అంజిబాబు, సుధాకర్,ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో విజయం సాధించాలి

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు

మద్నూర్, ఫిబ్రవరి 21: విద్యార్థులు అన్ని రంగాల్లో విజయం సాధించి, గ్రామానికి, తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తీసుకుని రావాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న వీడ్కోలు సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై సలహాలు, సూచనలు అందజేశారు. విద్యార్థులకు ఇష్టమున్న సబ్జెక్టులను మాత్రమే ఎంచుకోవాలని, ఇతరులు చెప్పారని సబ్జెక్టులు తీసుకోవద్దన్నారు. విద్యా, ఆట, పాటలు, ఇతర రంగాల్లో ప్రావీణ్యం సంపాదించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు అవసరమైన గదులు నిర్మించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి, కళాశాల పేరు నిలపాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, అన్ని రంగాల్లో ప్రతిభ సాధించి, ఆసక్తి గల రంగంలో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు హన్మాండ్లు స్వామి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎల్‌పీవో

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు క్యాంపు కార్యాలయంలో బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఇటీవల బాన్సువాడ డీఎల్‌పీవోగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజు బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి జరిగేలా తనవంతు కృషి చేస్తానని, గ్రామ పంచాయతీలను పరిశీలించి, తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంగమేశ్వర్, వెంకట్రాం రెడ్డి, వినోద్, హన్మాండ్లు స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులపైనే దృష్టి

బిచ్కుంద: నియోజకవర్గంలో వ్యవసాయానికి సాగునీరు అందించే పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం మండలంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న హన్మంత్‌షిండే వ్యవసాయానికి సాగునీరు అందించే నియోజకవర్గంలో ఉన్న ప్రాజెక్టులపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయపరంగా రైతుల అభివృద్ధి కోసం పెండింగ్ ప్రాజెక్ట్ పనులు త్వరితగతిన పూర్తిఅయ్యేలా దృష్టి సారించి 1,20,000 ఎకరాలకు సాగునీరు అందివడమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులే ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగాలలో ఉన్నారని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ హైస్కూల్, కళాశాలలో ప్రభుత్వం విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వపరంగా ప్రజా అవసరాలు తీర్చేందుకు నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని తనను కలిసి పనిలేకుండా ఆయా మండలాల అధికారులకు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌పటేల్, సొసైటీ చైర్మన్ బాలు, పుల్కల్ వెంకట్రాంరెడ్డి, విఠల్‌రెడ్డి, గంగాధర్, రాజు, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.


బిచ్కుందలో సొసైటీ గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 21: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే పేద మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్,పార్శీ) విద్యార్థులు సీఎం ఓవర్సీస్ స్కాల ర్‌షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ లేదా డాక్టరేట్ కోర్సులు చదివేందుకు స్కాలర్‌షిప్, ఫైనాన్షియల్ అసిస్టెంట్ మంజూరుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అన్ని అర్హత ప్రమాణా లు కలిగి, విదేశీ విశ్వవిద్యాలయాల్లో పోస్టుగ్రాడ్యుయేట్ లేదా డాక్టరేట్ కోర్సులలో 2023 ఆగస్టు 1 నుంచి 2023 డిసెంబరు 31 వరకు పర్మీషన్ తీసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.తెలంగాణ ఈపాస్. సీజీజీ.జీవోవి.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వార్షిక ఆదాయం 5లక్షల లోపు ఉండాలన్నారు. అర్హతగల విద్యార్థులు మార్చి 20 సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపా రు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని రూం నెంబర్ 222లో సంప్రదిం చాలని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు చెల్లించాలి

- మండల ప్రత్యేక అధికారిణి సుష్మారెడ్డి

భిక్కనూరు, ఫిబ్రవరి 21: మండలంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంటి పన్నులను చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మండల ప్రత్యేక అధికారిణి సుష్మారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో రూ.25లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపీపీ గాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ఆనందం, గ్రామ కార్యదర్శి లక్ష్మీ, డీసీసీ ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ సాయాగౌడ్, నాయకులు లింబాద్రి, బల్యాల సుదర్శన్, టెంట్‌హౌస్ స్వామి, శ్రీనివాస్, బాగారెడ్డి, సురేందర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అనిల్, బాబు, తదితరులు పాల్గొన్నారు.


పెద్దమల్లారెడ్డిలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బిచ్కుంద, ఫిబ్రవరి 21: బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని బిచ్కుంద ఎస్ఐ మోహన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలంటూ పోలీసులు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విలువైన వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులకు అప్పజెప్పి బయటకు వెళ్లరాదని దొంగలు సాధారణ ప్రయాణికులలాగానే మాటమాట కలిపి మోసగిస్తారని తెలిపారు. విధులలో కూడా కొత్తగా అనుమానం కలిగే వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలని తెలిపారు

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

రామారెడ్డి, ఫిబ్రవరి 21: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు కన్నయ్య తెలిపారు. బుధవారం మండలంలోని గిద్దగ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు వీడ్కోల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు కష్టపడి చదివించినప్పుడు తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. గ్లోబల్‌యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు.

టీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

భిక్కనూరు, ఫిబ్రవరి 21: మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో పీజీ మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీఆర్వో సరిత మాట్లాడుతూ మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్షల్లో 166 మంది విద్యార్థులకు గానూ 160మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. కాగా పరీక్షా కేంద్రాన్ని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హరిత, అంజయ్య, శ్రీమాత, తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 21: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు డ్రాయింగ్ లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను ఈనెల 24 నుంచి 27 వరకు ఉదయం 10గంటల నుంచి 12.30కు, 2 గంటల నుంచి 4.30 వరకు నిర్వహించడం జరుగుతుందని డీఈవో రాజు తెలిపారు. టేలరింగ్ ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ అండ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షను ఈనెల 25 నుంచి 27 వరకు ఉదయం 10గంటల నుంచి 12.30కు, 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హాల్ టికెట్‌లను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్ఈ.తెలంగాణ.జీవోవి.ఇన్ అనే వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్‌కి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పెన్సిల్, కలర్స్, రాత అట్టలు తదితర సామగ్రిని, టేలరింగ్ ఎంబ్రాయిడరీ లోయర్‌గ్రేడ్, హయ్యర్ గ్రేడ్‌కి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కుట్టుమిషన్‌లు, టేబుల్, కత్తెర తదితర సామగ్రిని తమవెంట తెచ్చుకోవాలని సూచించారు.

మద్నూర్‌లో దుకాణ సామగ్రి వేలం పాట

మద్నూర్, ఫిబ్రవరి 21: మండలంలోని సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కొబ్బరి కాయలు విక్రయించడానికి దుకాణాల వేలం పాటను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన వ్యాపారులు వేలం పాట పడగా, రూ. 5 లక్షల 53 వేలకు వేలం పాటను పాడి దుకాణాలను దక్కించుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రకారం 50శాతం డబ్బులను చెల్లించారు.